అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 19 ఆగష్టు 2025 పేజీలు : 04

# రోడ్డు ప్రమాదంలో నలుగురిని కబళించిన మృత్యువు

## - ఒకరి పరిస్థితి విషమం.. 7 మందికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ప్రైవేట్ టెంపో్ట్రావెల్స్ వాహనం





ప్రమాదంలో మృతి చెందిన వారిని పరిశీలిస్తున్న పోలీసులు



ప్రమాదం జరగడంతో గుమిగూడిన ప్రజలు





రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలిస్తున్న దృశ్యాలు

**కదిరి/ తనకల్లు, ఆగస్టు 18 ప్రభాతవార్త**

తమ కుటుంబం అంతా చల్లగా ఉండాలన్న పవన్ కుమార్ ఆశలు అడిఆశలు చేస్తూ మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో వచ్చి భక్తులను కబలించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే కర్ణాటకలోని బళ్లారి చైతన్య కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వేల్పుల పవన్‌కుమార్ అనే వ్యక్తి ఈ నెల 14వ తేదిన తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దర్శనం కోసం ప్రైవేట్ టెంపో ట్రావెల్స్‌ను (కెఎ 17 సి 3998) నెంబర్ గల బండిని అద్దెకు తీసుకుని వెళ్లాడు. బళ్లారి నుంచి అరుణాచలం, తిరుమల దర్శనం అనంతరం సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే తాను ఒకటి తలచినా, దైవం ఒకటి తలచిందన్న చందాన 9 గంటల ప్రాంతంలో సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండిపల్లి క్రాస్ వద్ద వారు ప్రయాణిస్తున్న టెంపో ట్రావెల్ వెల్లి మరో టెంపో ట్రావెల్‌ను ఓవర్ టేక్ చేయబోయి మదనపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న ఏపిఎస్ ఆర్టీసి బస్సును ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించారు. అదుపు తప్పడంతో మదనపల్లికి వెళ్తున్న ఆర్టీసి బస్సును ఢీ కొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపి ప్రమాద విషయం తెలుసుకుని అక్కడ పరిస్థితిని సమీక్షించారు. ఈ రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ అత్త అనసూయమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మణికంట(36), నాగేంద్రప్ప(35), జాన్వి(4)లు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మద్యంలోనే మృతి చెందారు. రిత్విక పరిస్థితి ప్రస్తుతం అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వెనుకవైపు వస్తున్న మరో టెంపో వాహనం, ముందున్న టెంపో వాహనంను ఢీ కొనడంతో రోడ్డుప్రమాదం జరిగింది. పోలీసులు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే కదిరి ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో రెండు టూరిస్ట్ వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి, జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల మేర భారీగా రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాద ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు

**మరణించడం బాధాకరం : రవాణాశాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండిపల్లి వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం బాధాకరమని, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిందన్న సంఘటనపై మంత్రి వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి పరిస్థితి విషమంగా ఉన్నవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండి అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.

# అదే రాజకీయ రచ్చ.. పోలీసులకు అదే మచ్చ..!

- పోలీసులు జేసీ కనుసన్నల్లో పనిచేస్తున్నారన్న పెద్దారెడ్డి
- పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించని పోలీసులు
- నేను కాదు..తాడిపత్రి ప్రజలు రానివ్వడం లేదన్న జేసీ



నారాయణరెడ్డిపల్లి వద్ద తాడిపత్రికి రాకుండా కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడి



పెద్దారెడ్డి రాకను అడ్డుకుంటారేమోనని జేసీ ప్రభాకర్‌రెడ్డిని నిలువరిస్తున్న పోలీసులు



నారాయణరెడ్డిపల్లి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డిని వెనక్కు పంపుతున్న పోలీసులు

**తాడిపత్రి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

తాడిపత్రిలో గత 14 నెలలుగా కొనసాగుతున్న రాజకీయ రచ్చే సోమవారం కూడా పునరావృతమైంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రిలోని తన ఇంటికి బయలు దేరడం, తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అండ్ కో పెద్దారెడ్డిని అడ్డుకోవడానికి సిద్ధమవడం, పెద్దారెడ్డిని మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడం వంటి సంఘటనలు మరోసారి చోటు చేసుకున్నాయి. ఈ సారి హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయని, కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులే బందోబస్తు మధ్య తాడిపత్రికి తీసుకు రానున్నారని ఆశగా ఎదురు చూసిన వైకాపా శ్రేణులకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. ఈ నెల 18న అయిదు వాహనాల్లో తాడిపత్రికి వెళ్లేందుకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఉదయం 10-11 గంటల మధ్యన తాడిపత్రికి చేరుకునే పెద్దారెడ్డి ఇంటి వద్ద 60 మంది అనుచరులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం విదితమే. దీంతో సోమవారం ఉదయం 9 గంటలకు పెద్దారెడ్డి తిమ్మంపల్లి నుంచి తన అయిదు వాహనాల్లో తాడిపత్రికి బయలు దేరారు. అదే సమయంలో తాడిపత్రిలోని అనంతపురం రోడ్డులో ధ్యాన శివుని విగ్రహావిష్కరణ పూర్తి చేసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో బైపాస్ రోడ్డు గుండా తన ఇంటికి బయలు దేరారు. ఇద్దరూ అదే రోడ్డులో ఎదురు పడే అవకాశం ఉన్నందున పోలీసులు రంగ ప్రవేశం చేసి కేతిరెడ్డి పెద్దారెడ్డిని పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి వద్ద నిలువరించి, జేసీ ప్రభాకర్‌రెడ్డిని పుట్లూరు రోడ్డు గుండా ఆయన ఇంటికి పంపారు. ఇక్కడి నుంచి హైడ్రామా చోటు చేసుకుంది. తన వద్ద ఉన్న హైకోర్టు ఆదేశాలను డీఎస్పీ వెంకటేశ్వర్లుకు చూపించి తనను తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతివ్వాలని పెద్దారెడ్డి కోరగా స్టాపర్స్‌ను అడ్డం పెట్టి పెద్దారెడ్డి కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పెద్దారెడ్డికి అనుకూలంగా హైకోర్టు సింగిల్ బెంచి ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ పోలీసులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించినట్లు, అక్కడి నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించేది లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దారెడ్డి పోలీసుల చర్యలను నిరసిస్తూ అక్కడే కుర్చీ వేసుకొని సాయంత్రం 6 గంటల వరకు నిరసన వ్యక్తం చేశారు. 600 మంది పోలీసుల భద్రత ఉన్నప్పటికీ తనను తాడిపత్రికి పంపలేక పోతున్నారంటే ఇక పారా మిలటరీ రావాలేమోనని, ఇక్కడి పోలీసులు తమ ఉన్నతాధికారులు చెప్పినట్లు కాకుండా జేసీ కనుసన్నల్లో పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని పెద్దారెడ్డి ఎద్దేవా చేశారు. ఇక దీనిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వండి అని తాను చెబుతున్నా తాడిపత్రి ప్రజలు అంగీకరించడం లేదని మీడియాతో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దారెడ్డి చేసిన అరాచకాలకు ప్రస్తుతం ఫలితం అనుభవిస్తున్నాడని, తాము కూడా గతంలో హైకోర్టును, మానవ హక్కుల సంఘాన్ని, చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించినా తమను ముప్పతిప్పలు పెట్టారని జేసీ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. పెద్దారెడ్డి రాకను తాడిపత్రి ప్రజలు ఎవరూ హర్షించడం లేదని, పోలీసులను సాకుగా చూపకుండా పెద్దారెడ్డి తాడిపత్రి రావాలని జేసీ అన్నారు. ఈ సంఘటనల నేపథ్యంలో భారీ ఎత్తున మోహరించిన పోలీసులకు హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించలేకపోయారనే మచ్చ మిగలడం కొసమెరుపు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

## - ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం - స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత





ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సవిత, ర్యాలీలో పాల్గొన్న వందలాది ట్రాక్టర్లు

**పెనుకొండ ఆగస్టు 18 ప్రభాతవార్త**

అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖమంత్రి ఎస్.సవిత అన్నా రు.. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా సోమవారం పట్టణంలో నియోజకవర్గ పరిధిలోని రైతులు భారీ ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగి చారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చు తున్నారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. ఉచిత ఇసుకతో పాటు మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నా రు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం పేరుతో నిధులు అందజేశామన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో ఇవ్వని విధంగా సామాజిక పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. వితంతు, వృద్ధాప్యపు పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేశామన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించుకుండా అడ్డుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. దేశ విదేశాలకు తిరిగి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను మంత్రి లోకేశ్ గాడినపెడుతున్నారన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తూ ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ఏడాదికి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయాన్నిఅందజేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. తొలి విడతగా రూ.7 వేలను రైతుల ఖాతాల జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు అని తెలిపారు. 46,85,838 మంది రైతులకు వారి ఖాతాల్లో మొదటి విడతగా 2,342. 92 కోట్లు జమచేశామన్నారు.

రెండో విడతగా రూ.7 వేలు, మూడో విడతగా రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ తో పాటు విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలతో పాటు వ్యవసాయంలో సాంకేతికతను జోడిస్తున్నామని, డ్రోన్స్, శాటిలైట్, సెన్సార్, డీప్‌టెక్ వినియోగిస్తున్నామని తెలిపారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందజేస్తున్నామన్నారు. వంద శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు అందజేస్తున్నామన్నారు. పొలం పిలిచింది కార్యక్రమంతో రాష్ట్రంలో సాగు పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతమిస్తున్నామన్నారు ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వినాయక మండపం నిర్మాణానికి భూమిపూజ చేసిన మేయర్ వసీం



వినాయక చౌక్ లో భూమి పూజ చేస్తున్న మేయర్, ఉత్సవ కమిటీ సభ్యులు

**అనంతపురం. ఆగస్టు 18 ప్రభాతవార్త**

నగరంలోని వినాయక్ చౌక్ లో ఏర్పాటు చేయనున్న వినాయక మండపం నిర్మాణానికి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ,నగర మేయర్ మహమ్మద్ వసీం సోమవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 43 ఏళ్లుగా నగరంలో వినాయక చౌక్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. పిల్లలు, పెద్దలు అందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ వినాయక చవితి అన్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పరచూరి రమేష్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య ,కొగటం విజయ భాస్కర్ రెడ్డి, నాగన్న, ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌స్వామి, కార్యదర్శులు లలిత్‌కుమార్, కె.శ్రీనివాసులు, మల్లికొండ శ్రీనివాసులు,కోశాధికారి వేణుగోపాల్ ,కార్పొరేటర్ కమల్ భూషణ్ లతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన...!

## - ఆరు సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ - సీనియర్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగింత - పని ఒత్తిడితో సతమతమవుతున్న వైనం




**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతుంది. గత కొన్ని నెలలుగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో సీనియర్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగించి పాలనను కొనసాగిస్తున్నారు. ఈ విషయం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిసినా కూడా పట్టించుకోకపోవడం గమనార్హం.

జిల్లాలో 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. అందులో పదిహేను మంది మాత్రమే రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారు. మిగిలిన ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీరాములు జూన్‌లో పదవీ విరమణ పొందారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.జి.రెడ్డికి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే కళ్యాణదుర్గం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రామలక్ష్మి గత ఎడాది డిసెంబర్‌లో పదవీ విరమణ పొందారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నారాయణస్వామికి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈయన ప్రతి డాక్యుమెంట్‌కు డబ్బులు వసూళ్లు చేస్తుండటంతో ఓ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ విషయంలో గత నెలలో తన ఇంట్లో రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెట్‌గా పట్టుకున్నారు. ఆయన్ను ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దీంతో శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ తలారి మురళీను కళ్యాణదుర్గంకు బదిలీ చేసి ఆయనకే ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే గుత్తి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మంజునాథ్ యాదవ్‌కు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే తాడిపత్రి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బసవరాజును రాజకీయ ఒత్తిళ్లతో సెలవుపై పంపించారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివనారాయణకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే చిలమత్తూరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటనారాయణ ఇటీవల ఓ ఘటనలో సస్పెండ్ అయ్యారు. దీంతో అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను అక్కడికి బదిలీ చేసి ఆయనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అలాగే తనకల్లుకు గత కొంత కాలంగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయభాస్కర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా ఆరు కార్యాలయాల్లో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ల పాలన కొనసాగుతుంది. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న వారి స్థానాల్లో మరొక సీనియర్ అసిస్టెంట్‌లను నియమించలేదు. దీంతో సీనియర్ అసిస్టెంట్లు తమ రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్ విధులతో పాటు అదనంగా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ విధులు కూడా నిర్వర్తిస్తున్నారు. దీంతో రెండు విధులు నిర్వర్తించడం వలన పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఈ విషయం ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోస్టులను వెంటనే భర్తీ చేసి తమకు పని ఒత్తిడి తగ్గించాలని ఉద్యోగులు కోరుతున్నారు. అయితే దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

**త్వరలోనే సబ్ రిజిస్ట్రార్ పోస్టులను భర్తీ చేస్తాం : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి**



ఉమ్మడి జిల్లాలో ఆరు సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అక్కడే పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించడం జరిగింది. త్వరలోనే ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాము.

# బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్

## - ప్రజా సమస్యల వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్
## - పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలిజిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 18 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 550 అర్జీలను స్వీకరించారు. : శిక్షణ అనంతరం తిరిగి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వినోద్ కుమార్‌అంతకుముందు ముస్సోరీలో ఐఏఎస్ అధికారుల కోసం నిర్వహించిన మిడ్‌కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ యొక్క 23వ రౌండ్ ఫేజ్ III శిక్షణలో పాల్గొని.. తిరిగి అనంతపురం జిల్లా కలెక్టర్ గా డాక్టర్ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు డిఆర్ఓ పూలమొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జడ్పి సిఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీమ్ భాష, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఆత్మారావు, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, డిసిఓ అరుణకుమారి, డివిఈఓ వెంకటరమణ నాయక్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, డిటిసి వీర్రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాసరావు, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

02ATP27_02ATP27.qxd 18-08-2025 PM 10:28 Page 1



## స్కాలర్షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**హిందూపురం టౌన్ ఆగస్టు 18 ప్రభాతవార్త**

తపాలా శాఖ దీన దయాల్ స్పర్శ యోజన స్కాలర్షిప్ పరీక్షలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరిండెంట్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేయడానికి ఆరవ తరగతి నుంచి, 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని దీనికి దరఖాస్తు చేయడానికి సెప్టెంబర్ నెల 16 చివరి తేదీ అని తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఈపరీక్ష రెండువిభాగాలుగా నిర్వహించడం జరుగుతుందని రెండు విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన వారికి 6వేల రూపాయలు స్కాలర్షిప్ అందించడం జరుగుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు హిందూపురం తపాలా శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని అన్నారు.

## నిద్రగట్ట గొల్లహట్టిలో హారతి ఉత్సవాలు

**అమరాపురం ఆగస్టు 18 ప్రభాతవార్త**



హారతి ఉత్సవాలు దృశ్యం

మండల పరిధిలోని నిద్ర గట్ట గ్రామంలోని గొల్లవాట్టి లో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలను శ్రీకృష్ణ యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు..గోపూజ కార్యక్రమాలు మరియు ప్రతి ఇంటి నుండి మహిళలు హారతి ఉత్సవాలను శ్రీకృష్ణ జయంతి సందర్భంగా నిర్వహించారు .యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ట్రాక్టర్తో ప్రతిష్టాపన చేసి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిద్ర గట్ట గొల్ల హట్టి యాదవ సంఘం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన పెంచుకోండి ఎయిడ్స్ ను నియంత్రించండి



ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

**గుమ్మఘట్ట ఆగస్టు18 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ,మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ మరియు డాక్టర్ మెడికల్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో గుమ్మఘట్ట మండలం గవర్నమెంట్ హై స్కూల్ లో ముఖ్యంగా స్టూడెంట్స్ను తిలకిస్తున్న ప్రజలను ఉద్దేశించి ఐ.ఈ.సి. ఇంటెన్సిఫైడ్ క్యాంపెన్ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై, సుఖవ్యాధులు, క్షయ వ్యాధి, డ్రగ్స్, మాదకద్రవ్యాల పైన, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమములో భాగముగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపులేకుండా ఎలాగాసమాజములో కలిసిజీవించాలి, హెచ్.ఐ.వి/ ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, చెడు వ్యాసనాలు డ్రగ్స్, మాదకద్రవ్యాల అలవాటు నో చెప్పండి. అలానే కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017,తిలిగి మందులు, APSACS app ,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అలానే హెచ్.ఐ.వి/ఎయిడ్స్ కరపత్రాలు ప్రజలకు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంత,ల్యాబ్ టెక్నీశేయన్ మాధవ రెడ్డి, ఫార్మసి సిస్టర్ మాణిమల,ఆయుర్వేదిక్ రాధ, శిబీది స్టాఫ్ హై స్కూల్ ఇంచార్జ్ శ్రీదేవి, యోగేంద్రనాథ్ మరియు స్టాఫ్ టీచర్స్, స్టూడెంట్స్,అంగన్వాడీ చంద్రకళ,కామాక్షి, మాస్ ఎడ్యుకేషన్ స్టాఫ్ ఔట్రీచ్ వర్కర్స్ సుధా,భారతమ్మ, పీర్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల



సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**లేపాక్షి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలోని ఎన్ఆర్ నగర్లో సిపిఐ కార్యదర్శి గౌతమ్కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గౌతమ్కుమార్తో పాటు, సీనియర్ సిపిఐ నాయకులు శివప్పలు మాట్లాడుతూ ఈ నెల 20 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర సిపిఐ మహాసభలను దిగ్విజయం చేయాలని సిపిఐ నాయకులను కోరారు. భవిష్యత్తు కార్యాచరణను ఈ సభల్లో నిర్ణయించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం అమలు కాలేదని రైతుల గగ్గోలు

**గుత్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త**



రైతులు ఏఒ కార్యాలయం వద్ద బైటాయించిన దృశ్యం

గుత్తి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమకు పిఎం కిసాన్ యోజన పథకం మేరకు 2 వేలు జమ అయ్యాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పథకం మేరకు 5 వేలు తమకు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కార్యాలయంలో సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు తగు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి ముస్తాక్అహ్మద్ తెలిపారు.

## వ్యక్తి మృతి పట్ల గుత్తి ఆసుపత్రి వద్ద ధర్నా

**గుత్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మారెప్ప అనే వ్యక్తి మృతి చెందాడని ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన మారెప్ప అనే వ్యక్తి గత నాలుగు రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వచ్చాడు. అయితే అతడు చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అతడు మరణించాడని కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అయితే ఈ వ్యవహారంపై ఆసుపత్రి సూపరింటెం డెంట్ ఎల్లప్ప మాట్లాడుతూ వైద్య పరంగా తాము అతనికి తగిన వైద్య సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు.

## వైభవంగా దొన గంగమ్మజాతర

### పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం ఆగస్టు 18ప్రభాతవార్త**



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం మండల పరిధిలోని టి వీరాపురం గ్రామం లో సోమవారం జరిగిన దొన గంగమ్మ రథోత్స వంలో వైభవంగా జరిగింది ఈ సందర్భంగా గ్రామ సమీపంలో ఉన్న దొన (కొలను)వద్ద ఉన్న దేవాలయంలో గంగమ్మ అమ్మవారికి పూజారులు పూజలు నిరహించారు అనంతరం రథ న్ని పూలతో అలంకరించి అమ్మ వారిఉత్సవ విగ్రహం ను గ్రామం వరుకు ఊరేగించారు ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు పాల్గొని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం రథోత్సవంలో అమ్మవారి దీవెనలు అందుకొన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు రాజశేఖర్ సుంకన్న పాల్గొన్నారు.

## దొంగల అడ్డాగా జాతీయ రహదారి

**డి.హిరెహాళ్ ఆగస్టు 18 ప్రభాతవార్త**



కారు డిక్కీలో దొంగలు దోచిన వస్తువులు

దొంగలకు జాతీయ రహదారి అడ్డాగా మారిందా అని డి.హిరెహాళ్ లోని జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణాల యజమానులు, ప్రజలు బాహాటంగా చర్చించు కుంటున్నారు. చోరీకి పాల్పడిన దొంగలు దొంగతనంకు ఉపయో



దొంగతనంకు దొంగలు ఉపయోగించిన కారు

గించిన కారు వదిలి ఉడాయించిన ఉదంతం ఆదివారం రాత్రి డి.హిరెహాళ్ లో చోటుచేసుకుంది. ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి అందించిన వివరాల మేరకు గ్రామంలోని మోటారు రివైండింగ్, వెల్డింగ్ దుకాణంలో చోరీ చేసి పారిపోయే సమయంలో పోలీస్ సైరన్ విని దొంగతనానికి ఉపయోగించి న కారును వదిలి దొంగలు పారిపోయారని ఆయన చెప్పారు.150ఎ జాతీయ రహదారి పక్కనే ఉన్న మోటారు రివైండింగ్ వెల్డింగ్ దుకాణంలో వైర్లు, ఇతర సామాన్లను తీసుకొని కారు డిక్కీలో వేసుకొని హుడాయించే సమయంలో, పోలీస్ సైరన్ విన్న దొంగలు కంగారులో కారు నడపడంతో అక్కడే దగ్గరలో కారు బురదలో ఇరుక్కోవడం దొంగలు కారు వదిలి పారిపోవడం జరిగిందని ఆయన చెప్పారు. దుకాణంలో దొంగలించిన వస్తువులన్నీ కారు డిక్కీలో దొరికాయని దుకాణం యజమాని పంపావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని ఎస్ ఐ తెలిపారు. ఈనెల 5 వ తెదీ రాత్రి గ్రామ సమీపం లోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓబులాపురం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కోరి మల్లికార్జున కు చెందిన సందీప్ హార్డ్వేర్ దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ జాతీయ రహదారిపై ఇనుము తరలించే వాహనాల నుండి తరచూ దొంగలు ఇనుము చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో జాతీయ రహదారిపై నిఘా ఉంచి గస్తీ ముమ్మరం చేశామని ఈ నేపథ్యంలోనే ఈ చోరీకి పాల్పడిన దొంగలు సైరన్ విని కారు వదిలి ఉడయించారని ఎస్ఐ చెప్పారు.

## ఫోటోలు దిగారు... వెళ్లారు

-రాంపురంలో శిథిలావస్థ భవనంలోనే అంగన్వాడి నిర్వహణ
-చిన్నారులతో చెలగాటమాడుతున్న ఐసిడిఎస్ అధికారులు
- సమస్య పరిష్కరించినట్లుగా జిల్లా అధికారులను తప్పుద్రోవ పట్టించిన వైనం



సచివాలయంలో కనిపించని అంగన్వాడి సామాగ్రి

**కంబదూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త**

కంబదూరు మండలం రాంపురం గ్రామంలో ఆరుబయటే అంగన్వాడీ విద్యాబోధన అని శీర్షిక ఈనెల 12 వ తేదీన పలు పత్రికల్లో ప్రచురితమైంది. చర్యలు తీసుకుంటామని చెప్పిన ఐసిడిఎస్ అధికారులు తూతూ మంత్రం గా సచివాలయంలోకి అంగన్వాడి కేంద్రాన్ని మార్చినట్లు ఫోటోలు దిగి మరుసటి రోజే శిథిలావస్థకు చేరిన భవనంలో అంగన్వాడీ కేంద్రం కొన



సమస్య పరిష్కరించినట్టుగా సచివాలయం వద్ద అధికారులు దిగిన ఫోటో దృశ్యం

సాగించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. దీంతో చిన్నారులతో చెలగాటమాడుతున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ , సూపర్వైజర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాంపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని ప్రత్యామ్నాయంగా వేరే భవనం లోకి మార్చాలని జిల్లా ఐసిడిఎస్ పిడీ చెప్పినప్పటికీ ఆమె మాటలను బేఖతార్ చేశారు. పైగా సమస్యను పరిష్కరించినట్లు ఫోటోలు దిగి జిల్లా స్థాయి అధికారులను తప్పు ద్రోవ పట్టించడంతో సంబంధిత ఐసీడీఎస్ అధికారుల తీరుపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## ఉరి వేసుకుని చేనేత కార్మికుడు ఆత్మహత్య

**లేపాక్షి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలోని వీవర్స్ కాలనీలో లక్ష్మీపతి (41) అనే చేనేత కార్మికుడు తలనొప్పి భరించలేక సోమవారం తెల్లవారుజామున ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వివరాలు ఇలావున్నాయి. వీవర్స్ కాలనీకి చెందిన లక్ష్మీపతి చేనేత కార్మికునిగా జీవనం సాగిస్తుండేవాడన్నారు. ఇతనికి భార్యతో పాటు ఏడు నెలల కుమార్తె వుందన్నారు. లక్ష్మీపతి చాలాకాలంగా తలనొప్పితో బాధపడుతూ వుండేవాడన్నారు. పలుప్రైవేట్, ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న తలనొప్పి తగ్గలేదన్నారు. ఆదివారం రాత్రి తలపోటు ఎక్కువగా రావడంతో సోమవారం తెల్లవారుజామున ఇంటిలోఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడ న్నారు. ఉదయం 6 గంటల సమయంలో లక్ష్మీపతి భార్య సుమిత్ర లోపలి గది నుండి బయటకు రాగానే ఆత్మహత్య చేసుకున్న భర్త కనిపించాడన్నారు. ఆ సమయంలో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని లక్ష్మీపతిని కిందకు దించి లేపాక్షి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భావి తరాల భవిష్యత్ కోసం రాయదుర్గాన్ని సుందరంగా తయారుచేద్దాం

- తగిన సూచనలు ఇవ్వండి.
- పుర ప్రముఖులకు ఎమ్మెల్యే కాలవ సూచన



పట్టణ ప్రముఖులతో సమావేశమై మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాసులు

**రాయదుర్గం ఆగస్టు 18 ప్రభాతవార్త**

రాబోయే 20 ఏళ్లలో రాయదుర్గాన్ని ఎలా చూసుకోవాలని పట్టణ వాసులు భావిస్తున్నారో ఆ విధంగా అందమైన, సౌకర్యవంతమైన మాస్టర్ ప్లాన్ తయారీలో సూచనలు ఇవ్వాలని రాయదుర్గం పట్టణవాసులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. రాయదుర్గం పట్టణంలోని మునిసిపల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన పురపాలక సంఘం సమావేశంలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ గురించి ఆయన వివరించారు. తరాల మధ్య ఆలోచన విధానంలో మార్పులు అనివార్యమని పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణాన్ని భావితరాలు ఏ విధంగా చూడాలని భావిస్తున్నాయో అందుకు అనుగుణంగా రూపకల్పన జరగాలన్నారు. 2014 19 మధ్య జరిగిన ప్రధాన రహదారుల విస్తరణ పనులను పట్టణవాసులు మెచ్చుకున్నారని సూచించారు. అదేవిధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏ ప్రాంతంలో ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశాలపై నమూనా ప్రతిపాదన సిద్ధం చేయించడం జరిగిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ ప్రతినిధులు రాయదుర్గం పట్టణ అభివృద్ధికి ఓ సమగ్ర ప్రాథమిక నివేదిక తయారుచేసి పంపిందన్నారు. ఏ ఏ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఏ మేరకు చేపట్టాలి.? పట్టణంలో నివాస, వాణిజ్య, పరిశ్రమలకు అనువైన ప్రాంతాలేవీ..? అన్నది విభజించడం జరిగిందన్నారు. పట్టణాన్ని అందంగా, సౌకర్యంగా తీర్చిదిద్దుకోవడానికి అవసరమైన ప్రణాళిక ఇందులో రూపొందించడం జరిగిందన్నారు. ఇది కేవలం డ్రాఫ్ట్ మాత్రమేనని, ఇందులో పేర్కొన్న అంశాల్లో మన పట్టణ అవసరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. వీటి అమలులో కొందరికి ఇబ్బంది తలెత్తినా... చాలామందికి ప్రయోజనం చేకూర్చేలా ఉంటే తప్పక పరిగణలోకి తీసుకోటానికి వీలుందన్నారు. పట్టణ వాసులు ఇందులోని ఒక్కో అంశాన్ని పరిశీలించి అవసరమైన సూచనలు సలహాలు ప్రతిపాదించాలని కాలవ కోరారు.

## నేడు ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం

**కొత్తచెరువు ఆగస్టు 18 ప్రభాతవార్త.**

కొత్తచెరువు ఎంపీడీవో కార్యాలయం నందు మంగళవారం ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించబడునని ఎంపీపీ ఆర్.గాయత్రి ఓ ప్రకటనలో తెలిపారు ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు వివిధ శాఖ అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు గైరహాజరైన వారిపై తగిన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు.

## 4.024 టీఎంసీలకు చేరిన పీఏబీఆర్ నీటిమట్టం..!

-డ్యాంలోకి 1,770 క్యూసెక్కులు మేర కృష్ణా, తుంగభద్ర జలాలు



కృష్ణా, తుంగభద్ర జలాలతో కళకళలాడుతున్న పీఏబీఆర్ డ్యాం

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**



డ్యాంలో 433 మీటర్లకు చేరిన నీటిమట్టం

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తున్న డాక్టర్ కె.ఎస్.పెన్నఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో (పీఏబీఆర్) సోమవారం నాటికి నీటి మట్టం 4.024 టీఎంసీలకు చేరిందని ఎస్ఈ సుధాకర్రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మిదేవి, రేణుక తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి డ్యాంలోకి బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి జలాశయం నుంచి కృష్ణా జలాలు చేరుతుండగా 2వ తేదీ నుంచి ఉరవకొండ మండలం మోపిడి గ్రామంవద్దగల హెచ్ఎల్సీ లింక్ ఛానల్ నుంచి తుంగభద్ర జలాల చేరిక మోదలైన విషయం తెలిసిందే. పీఏబీఆర్ జలాశయం నీటి సామర్థ్యం 11.100 టీఎంసీలు (443.000 మీటర్లు) కాగా ప్రస్తుతం 4.024 టీఎంసీలకు (433.200 మీటర్లు) చేరిందని అధికారులు తెలిపారు. డ్యాంలోకి హంద్రీనీవా కాలువ ద్వారా జీడిపల్లి జలాశయం నుండి కృష్ణా జలాలు 1,672 క్యూసెక్కులు, హెచ్ఎల్సీ ద్వారా మోపిడి లింక్ ఛానల్ నుండి తుంగభద్ర జలాలు 98 క్యూసెక్కులు చేరుతున్నాయన్నారు. డ్యాం నుండి కుడి కాలువ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి అవసరాలు తదితరాలు కలిపి 130 క్యూసెక్కులు అవుట్ఫ్లో కొనసాగుతోందని వివరించారు.

## కృష్ణా జలాలకు జల హారతి కార్యక్రమం

**కొత్తచెరువు ఆగస్టు 18 ప్రభాతవార్త**



కొత్తచెరువు మండల పరిధి లో మామిళ్ల కుంట రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద కృష్ణా జలాలకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జల హారతి కార్యక్రమం నిర్వహించబడును ఈ కార్యక్రమానికి నియోజకవర్గంగా ఉన్న సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బత్తలపల్లి మండలంలో పాఠశాల బాలికల కోసం ఆధునిక మరుగుదొడ్లు ప్రారంభం.

- మంత్రి సత్య కుమార్ యాదవ్ సతీమణి త్రివేణి చేతుల మీదుగా టాయిలెట్స్ ప్రారంభోత్సవం. - చదువుతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం - త్రివేణి. - విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై ఆరా తీసిన త్రివేణి - రుచి చూసి సంతోషం వ్యక్తం చేశారు







పాఠశాలలో టాయిలెట్లు ప్రారంభిస్తున్న ఆరోగ్య శాఖామంత్రి సతీమణి త్రివేణి , మా లెవంతం పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న త్రివేణి , పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న త్రివేణి

**బత్తలపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ చొరవతో, సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో, హిందుస్తాన్ కోకా కోలా బేవరేజెస్ సంస్థ సహకారంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా బత్తలపల్లి మండల పరిధిలో రెండు పాఠశాలల్లో కొత్తగా నిర్మించిన టాయిలెట్ల ను ప్రారంభించారు. బత్తలపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మాల్యవం తం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థినీల అవసరాల దృష్ట్యా నిర్మించిన ఈ ఆధునిక మరుగుదొడ్లను మంత్రి సత్యకుమార్యాదవ్సతీమణి త్రివేణి సోమవా రం ప్రారంభించారు. ఈసందర్భంగా త్రివేణి మాల్యవంతం పాఠశాలలోని విద్యార్థినీలతో భోజ నంపై ఆరా తీశారు. భోజనం ఎలా ఉందో పిల్లల తో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి, ఆమె మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పిల్లలకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచిపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా త్రివేణి, వారికుమారుడు రిషి అద్వానీతో కలిసి మాల్యవంతం పాఠశాల ప్రాంగణంలో మొక్కలునాటారు. విద్యార్థులకుపచ్చదనం, స్వచ్ఛ మైన వాతావరణం ఎంత ముఖ్యమో వివరిస్తూ, పాఠశాల చుట్టూ పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ, బాలికల చదువులో సౌకర్యాలు అత్యంత ముఖ్యమని, పరిశుభ్రమైన టాయిలెట్లు అందుబాటులో ఉండడం వల్ల విద్యార్థినీలు మరింత సౌలభ్యంతో తమ చదువును కొనసాగించగలరని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినీల హాజరు పెరుగుదలకు ఇటువంటి సౌకర్యాలు దోహదపడతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్, ధర్మవరం రూరల్ మండల అధ్యక్షులు చంద్ర, టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, గంటాపురం జగ్గు, నాగభూషణం, సాంబ, చెర్లోపల్లి నాగభూషణం, తాతయ్య, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నోరు మెదపని వార్డు సభ్యులు..!

- దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా స్పందనలేదు - వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలుస్తున్నా ఎవరికీ పట్టదు - కేవలం 20 నిమిషాల్లోనే ముగిసిన పంచాయతీ సాధారణ సమావేశం

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**



మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన సాధారణ సమావేశం

నియోజకవర్గ కేంద్రమైన, దాదాపు 45వేల మంది జనాభా కల్గిన ఉరవ కొండ పట్టణంలో ఎక్కడా ఏఒక్క సమస్య లేదన్నట్టు సమావేశానికి హాజరైన వార్డు సభ్యులు మౌనం పాటించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సోమవారం పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాల యంలో పంచాయతీ సాధారణ సమావేశం సర్పంచ్ మీనుగ లలిత అధ్యక్షతన కార్యదర్శి ఎ.గౌస్సాహెబ్ ఆధ్వర్యంలో జరుగగా ప్రజా సమస్యలపై వార్డు సభ్యులు ఏఒక్కరు కూడా నోరు మెదపకపోవడం విశేషంగా చెప్పాలి. సమావేశంలో గత సమావేశం తీర్మాణాలు చదివి వినిపించడంతోపాటు ఖర్చుల పద్దులకు సంబం ధించి 31 అంశాలు, భవన నిర్మాణాలు, వివిధ రకాల అర్జీలకు సంబంధించి మరో 16 అంశాలతో అంజెండా రూపొందించగా పంచాయతీ జూనియ ర్ అసిస్టెంటు వాటిని వరుసబెట్టి చదువుకొంటూ పోతుండగా కనీసం ఆయా అంశాల గూర్చి ఏఒక్క వార్డు సభ్యుడు కూడా వివరాలు అడిగి తెలుసు కునే ప్రయత్నం కూడా చేయకపోవడం ఆశ్చర్యా నికి గురిచేసింది. గతంలో జరిగి సమావేశాలకు పూర్తి భిన్నంగా ఎవరో కట్టడి చేసినట్లు వార్డు సభ్యులు మౌనముద్ర పాటించడం కార్యాలయ సిబ్బందినే నివ్వెరబోయేలా చేసింది. గత పక్షం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో దోమల వ్యాప్తి అధికంగా ఉండి ప్రజలు మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారినపడి ఆసుపత్రులు కిటకిటలాడుతుండగా కనీసం దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలని కూడా ఎవరూ పాలకపక్షాన్ని అడుగలేదు. ఎప్పుడు వర్షం వచ్చినా క్లాక్ టవర్ కూడలి, గుంతకల్లు రోడ్డులోని సులభ కాంప్లెక్స్ ప్రాంతం తదితర ప్రధాన కూడళ్లతోపాటు కొత్త కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నా స్పంద నలేదు. బస్టాండ్, కవితా హోటల్ సర్కిల్లో ఇష్టారాజ్యంగా తోపుడు బండ్లు పెడుతుండటం, దానికితోడు నిత్యం రోడ్లపైనే పశువులు ఉంటుండటంతో పాదచారులు మొదలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ఆ సమస్యపై మాట్లాడేవారే లేకుండా పోయారు. అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు సైతం సరిగ్గా వెలుగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, కుళాయి కనెక్షన్ల కోసం రోడ్లను తవ్వి మరమ్మతులు చేయకుండా మట్టి కప్పి వదిలేయడంతో ఏర్పడిన గుంతలు, అనధికారికి స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు పడుతున్న కష్టాలు ఎవరికీ పట్టలేదు. చిన్న చిన్న సమస్యలనే పట్టించుకోనివారు పంచాయతీ పబ్లిక్ పర్పస్ స్థలాల పరిరక్షణ లాంటి కీలకమైన అంశాలపై నోరు మెదపకపోవడంపై పెద్దగా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని చెప్పాలి. ఏదో రాజకీయ పార్టీ సమావేశానికి వెళ్లి నాయకుల ప్రసంగాలను విని వెనుదిరిగినట్లు అధికారులు అజెండాలోని అంశాలను చదివి వినిపిస్తే శ్రద్ధగా విని తలూపి కేవలం 20 నిమిషాల్లోనే బయటికి వచ్చేసారు మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు. తమ గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని మరీ ప్రజాప్రతినిధులు ఏవిధంగా నిలబెట్టుకుంటారో వారికే తెలియాలి.

09ATP27_09ATP27.qxd 18-08-2025 PM 11:38 Page 1



# మత సామరస్యానికి ప్రతీక బీబీ జైనబ్బీ దర్గా

-20న 'గంధం', 21న 'ఉరుసు', 22న 'జియారత్' -సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారి దర్గా -రెండు రోజులపాటు కొనసాగనున్న ఖవ్వాలి పోటీలు




ఉరవకొండలోని బీబీ జైనబ్బీ దర్గా , బీబీ జైనబ్బీ అమ్మవారి సమాధి దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**

మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఉరవకొండ పట్టణంలో వెలసిన పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహావారి దర్గా ఉరుసు ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాలు ఈనెల 20వ తేదిన 'గంధం' ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం కానుండగా బుధవారం సాయంత్రం కీ॥శే॥అల్లపరెడ్డి ఇంటి నుండి గంధం ఊరేగింపు బయలుదేరి కీ॥శే॥టి.హుసేన్‌పీరా ఇంటివద్ద చేప దేవుడి గుడి నుండి పట్టణ వీధుల గుండా మేళతాళాల నడుమ దర్గా చేరనుంది. 21న గురువారం 'ఉరుసు' కార్యక్రమం జరగనుండగా పామిడి బాషుసాబ్ అంగడి నుండి షంషేరు శుభ్రపరిచి రాయదుర్గం బుడెన్‌సాబ్ ఇంటి నుండి రాత్రి 12 గంటలకు షంషేరు పురవీధుల గుండా దర్గాకు చేరుతుంది. 22న తేదిన శుక్రవారం జియారత్ సందర్భంగా స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయం నుండి అమ్మవారికి సమర్పించేందుకుగాను చాదర్ ఊరేగింపు, రాత్రి జియారత్ ముగింపు జరుగనుంది. ఉరుసు, జియారత్ రోజుల్లో రాత్రి దర్గా ఆవరణంలో గొప్ప ఖవ్వాలి పోటీలు జరుగుతాయని ఆ రెండు రోజుల్లో మధ్యాన్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం ఉంటుందని దర్గా కమిటీ తెలిపారు. భక్తులు అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**జైనబ్బీ దర్గా పూర్వ చరిత్ర :** బీబీ జైనబ్బీ దర్గాకు సంబంధించి ఎటువంటి లిఖితపూర్వక చారిత్రక ఆధారాలు లేకపోయినా ఇక్కడి ప్రాంతానికి చెందిన హిందూ, ముస్లీం వయోవృద్దుల కథనం మేరకు పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా అమ్మవారు కర్నాటక రాష్ట్రం బీజాపుర్ వాస్తవ్యులు. ఆమె అపూర్వ సౌందర్యరాశి అని పెద్దల కథనం. బీబీ జైనబ్బీ గ్రామ గ్రామానా సంచరిస్తూ ఉరవకొండ ప్రాంతానికి చేరుకోనగా అప్పుడు ఈ ప్రాంతంలో మిలిటరీ క్యాంపు వేసివున్న బ్రిటిష్ సైనికులు కొందరు అమ మ్మవారిని చూసి దురుద్దేశంతో వెంటబడ్డారని కథనం. దీంతో వారి బారీ నుండి కాపాడుకునేందుకు మార్గం లేని సమయంలో అమ్మవారు భూమాతను నీ బిడ్డనైన నన్ను నీవే కాపాడాలంటూ వేడుకొన్నారు. దీంతో ఆ ప్రాంతంలో భూమి రెండుగా చీలి అమ్మవారిని లోపలకు తీసుకొని తిరిగి యథావిధిగా మూసుకుందని ప్రతీతి. వెంట తరుముతూ వచ్చిన సైనికులలో ఒకరు అమ్మవారు భూమిలోపలికి వెళ్లినప్పుడు బయటే మిగిలిపోయిన జడకుచ్చులను పట్టుకొని లాగగా రక్తం కక్కుకొని మృతి చెందినట్లు కథనం. ఈ విషయాన్ని మిగిలినవారు వారి కమాండెంట్‌కు తెలుపగా వచ్చి చూసి వెక్కిలింపుగా మాట్లాడిన ఆయన చూపు కోల్పోయినట్లు చెబుతారు. దీంతో తనతప్పు తెలిసి అమ్మవారిని భక్తితో వేడుకోగా దృష్టి ప్రాప్తించడంతో ఆయన తన వంతుగా ఆప్రదేశంలో కోరిన వారికి కొంగు బంగారంగా కనికరించిన అమ్మవారికి దర్గా నిరా మ్మణం జరిగింది. నాటి నుండి ప్రతి ఏడాది ఉరుసు ఉత్సవాలను హిందూ, ముస్లీంలు భక్తి ప్రవర్తలతో జరుపుకొంటునా న్నరు. కాగా భక్తులు అమ్మవారికి కోర్కెల గాజులు సమర్పించడం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పాలి.

# పేదల సంస్థ ఆర్డీటీను కాపాడుకోవడం మనందరి బాధ్యత..!

-ఆర్డీటీకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం కందం తొక్కిన పేదలు

-ఉరవకొండలో భారీ ప్రదర్శన, తహశీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**



తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా మాట్లాడుతున్న ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్ సాకే హరి

నిరంతరం పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకో వడం మనందరి బాధ్య తని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ జిల్లా కార్యదర్శి సాకే హరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకు ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఉరవకొండలో ఆర్డీటీ మహిళా సంఘాల మహిళలు, సంఘం ఉపాధ్యాయులు, నెట్‌వర్క్ లీడర్లు, దళిత సంఘాల ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు, ఆర్డీటీ



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అభిమానులు కదం తొక్కారు. పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం కవితా హోటల్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం చేరుకొని అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే హరి, మీనుగ గోపాల్, పాల్తూరు ఆనందరాజ్, రవి, చంద్రశేఖర్, లాలు ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఆర్టీడీ సంస్థ ఏడాదికి దాదాపు 500 కోట్ల రూపాయల బడ్జెట్‌లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, గృహాలు, మౌళిక వసతులు కల్పనకు కృషి చేస్తోందన్నారు. అలాంటి సంస్థ విదేశీ విరాళాలు సమీకరించుకోవడానికి వీలు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఆర్డీటీ సంస్థ సేవలు ఆగిపోతే పేదలు చాలా నష్టపోవాల్సి వస్తుందని గడిచిన దాదాపు 6 నెలలుగా జిల్లా ప్రజలందరూ ముక్తకంఠంతో నిరసన తెలుపుతున్నా కేంద్రంలో మాత్రం కదలిక లేకపోవడం దారుణమన్నారు. ఆర్డీటీను పరిక్షించుకోవడానికి సంస్థ ద్వారా ప్రయోజనం పొందిన వారందరూ సిద్ధంగా ఉన్నారని ఈ విషయాన్ని కేంద్రం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ధర్నా అనంతరం ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రపసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, ఆంజనేయ, ప్రసాద్, అంజి, సన్నప్పయ్య, బసవరాజు, రవి, శ్రీరాములు, మారెనన, మల్లప్ప నారాయణస్వామి, ఎర్రిస్వామి, విజయ్, సురేష్, సుంకన్న, పెన్నయ్య, శీనప్ప, చంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అధికారులను ఘనంగా సన్మానించిన నాయకులు



సన్మానం చేస్తున్న దృశ్యం

**అమరాపురం ఆగస్టు 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో సోమవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న తహసిల్దార్ లక్ష్మీనరసింహం, రెవిన్ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, సచివాలయ సర్వేయర్ నాగార్జున నాయక్ లను తెలుగుదేశం పార్టీ నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీజెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్, మారుతి ప్రసాద్,పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, మాలింగప్ప, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, మాజీ ఎంపీటీసీ రవి ప్రకాష్, పంచాయతీ కన్వీనర్లు ఎల్ఐసి నాగరాజు, బిఎస్ నాగరాజు, సీనియర్ నాయకులు సర్పంచులు లోకేష్ ,ధనుంజయ, మాజీ సర్పంచులు సేకునప్ప, హనుమంతరాయ, తాగునీటి సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి, నరసింహమూర్తి తదిరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

**వజ్రకరూరు ఆగస్టు 19 ప్రభాతవార్త**



టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న తిమ్మప్ప

మండల కేంద్రంలోనిమండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీకా (వ్యాక్సినేషన్) కార్యక్రమాన్ని ఎంఈఓ2 తిమ్మప్ప పర్యవేక్షించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని చిన్నపాటి అనారోగ్యం కలిగిన జాగ్రత్తగా ఉండకుండా తక్షణమే వైద్యున్ని సంప్రదించాలన్నారు. సుచి శుభ్రత కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫాతిమా బేగం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ పై అసహనం వ్యక్తం చేసిన మండల కన్వీనర్



పంచాయతీ కార్మికులతో సమావేశమైన టిడిపి మండల కన్వీనర్

**బత్తలపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

బత్తలపల్లి గ్రామపంచాయతీ హెడ్ క్వార్టర్ లోని పారిశుద్ధ్య కార్మికుల పనితీరు ఇంకా మెరుగవ్వాలని మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులలో చైతన్యం రావాలని మన ఇంటి పని ఎలాగో పంచాయతీ పనీ అలాగే చేయాలని కోరడం జరిగింది. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి మీకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయమని కోరగా, వారికి కావలసిన ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, పనిముట్లు ఏర్పాటు విషయంపై హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, యూనిట్ ఇంచార్జ్ బత్తల మనోజ్ కుమార్,తెలుగుదేశం నాయకులు, గడుపుటి రమేష్ బాబు, పంచాయతీ సెక్రెటరీ ముత్యాల నాయుడు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# భక్తుల కోలాహలం మధ్య వేణుగోపాలస్వామి బ్రహ్మారథోత్సవం




బ్రహ్మారథోత్సవ దృశ్యం

**అమరాపురం ఆగస్టు 18 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురం దక్షిణ గొల్ల హట్టిలో గోకులాష్టమి మరియు వేణుగోపాలస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేణుగోపాల స్వామి బ్రహ్మారథోత్సవం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. తెల్లవారుజామున రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకం గంధంతో విశేషాలంకారం మరియు విశేష పూజలను నిర్వహించారు. అనంతరం రథంగా హోమాన్నిఅర్చకులు హరీష్ బట్టర్ లు శాస్త్రోక్తంగా నిర్వహించి వేణుగోపాలస్వామి విగ్రహ మూర్తిని దేవాలయం నుండి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి రంగు రంగుల పూలతో అలంకరణ చేసిన బ్రహ్మ రథోత్సవంలో హరినామ స్మరణ చేస్తూ ప్రతిష్టించారు. స్వామివారికి విశేష పూజలు మంగళహారతి అనంతరం భక్తులు శ్రీకృష్ణ నామ జపిస్తూ రథాన్నిలాగారు.రథానికి అరటి పండ్లు విసిరి భక్తులు మొక్కుబడి తీర్చుకున్నారు. వర్షంలోనే స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో లాగారు.ఈ సందర్భంగా నాయకులు మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, శివకుమార్ యాదవ్, శివరాజ్ యాదవ్ దేవరాజ్ మాజీ డీలర్ కృష్ణమూర్తి, మహాలింగప్ప, చిత్తన్న దేవరాజు తోపాటు యాదవ సంఘం సభ్యులు మాజీ మండల కన్వీనర్ శివ రుద్రప్ప, మార్కెట్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, చంద్రశేఖర్ గౌడ్ ధనుంజయ కెంకెర తమ్మ రాయప్ప మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలోవిచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

# నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించండి

జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**శ్రీ సత్యసాయి జిల్లా , ఆగస్టు,18, ప్రభాతవార్త ప్రతినిధి:**

పి జి ఆర్ ఎస్ కార్యక్రమం పై ఎంతో నమ్మకంతో ప్రజల అందించే అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తో పాటు ఇంచార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు. డివిజన్ల వారీగా అందిన అర్జీలు వివరాలు:పుట్టపర్తి 67, పెనుకొండ 46, ధర్మవరం 54, మరియు కదిరి 33అర్జీలు, మొత్తం 200 అర్జీలను స్వీకరించడం జరిగిందని తెలిపారు.

# శ్రీ చిక్కనేశ్వర స్వామికి ఉత్సవ పల్లకి సేవ



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ చిక్కనేశ్వర స్వామి

**కనేకల్ ఆగస్టు 18 ప్రభాతవార్త**

కనేకల్ మండల కేంద్రంలో వెలి సిన శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయం నందు శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీ చిక్కనేశ్వర ఉత్సవమూర్తిని పల్లకిపై ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే శ్రీ సిద్ధప్ప స్వామి దేవాలయం నుండి సిద్ధప్ప స్వామి ఉత్సవమూర్తిని పల్లకిపై ఊరేగించారు. ప్రతి ఏటా శ్రావణమాసం సోమవారం శ్రీ చైతన్య స్వామి మరియు సిద్ధప్ప స్వామి ఉత్సవ పల్లకీలు ఎదురెదురుగా ఊరేగింపు జరుగుతాయి. సందర్భంగా శ్రీ చిక్కనేత్ర స్వామికి ఉదయాన్నే గంగపూజ రుద్రాభిషేకం బస్వాభిషేకం పూలాభిషేకం తదితర పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వీరేశ్ స్వామి తెలిపారు. అనంతరం సాయంకాలం స్వామివారికి ఊరేగింపుగా శ్రీ చిక్కనేసరు వడియాలు చెరువుకు వెళ్లి గంగని తెచ్చి పూజ నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారిని ప్రజలు దర్శించుకున్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

**కొత్తచెరువు ఆగస్టు 18 ప్రభాతవార్త**



వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం.

క్షయ వ్యాధి నివారణ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి నందు టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ డిటిసి అబిద్ భాష ఆధ్వర్యంలో క్షయ రోగులకు సంగ్వా ఏపీ హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో నిత్యవసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోధుమపిండి,రాగి పిండి,సెనగలు,వేరుశెనగ విత్తనాలు, కంది పప్పు, బెల్లం, అందజేశారు. అనంతరం డాక్టర్ సురేష్ క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు ఉన్న గళ్ళలో రక్తం పడడం ఆకలి తగ్గడం తరచుగా జ్వరం రావడం. బరువు తగ్గడం చెమటలు పట్టడం. ఈ లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచితంగా గళ్ళ పరీక్ష చేయించుకుని ఎక్సే తీయించుకొని క్షయ వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలని, టీబీ వ్యాధి ఉన్నట్లయితే ఆరు నెలల పాటు ఉచితంగా మందులు ప్రభుత్వం అందజేస్తుందని, కేంద్ర ప్రభుత్వం నెలకు వెయ్యి రూపాయలు చొప్పున 6 నెలలకు 6000 ఇవ్వనున్నారని, అందుకోసం క్షయ వ్యాధి ఉన్నవాళ్లు తప్పకుండా మందులు సక్రమంగా వాడాలని సూచించారు. ఈ రోగం ఎక్కువగా ఇటుక బట్టి లో పనిచేసే వాళ్లకు, సిమెంట్ పని చేసే వాళ్లకు ,పొగాకు బీడీ సిగరెట్ గుట్కా పాన్ తీసుకొని వాళ్లకు ,ఎక్కువగా వస్తుందనీ 60 సంవత్సరం పైబడిన వారికి, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందనీ, ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్ సురేష్ రామ మోహన్, ఓబులేషు, సూపర్వైజర్ అబిద్ భాషా, టిబిహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

# వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి

- ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్ళై



ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్ళై

**గుత్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని గుత్తి ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్ళై సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలకు దూరంగా వుండాలన్నారు. తడిచేతులతో స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదన్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభించాలి - ఎస్ఎఫ్ఐ

**గుత్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త**

విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అయినప్పటికీ ఇప్పటిదాకా డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్లు చేపట్టలేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నవీన్‌యాదవ్, చరణ్, థామస్, జగన్, ఓంసాయియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరించాలి

- ఆర్డిటి అభిమాన సంఘ నాయకులు డిమాండ్.




ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డిటి అభిమాన సంఘ నాయకులు

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 18 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా లో గల ఆర్ డి టి కి ఎఫ్ సి ఆర్ ఏ కేంద్రప్రభుత్వం పునరుద్ధరించాలని కోరుతూ ఆర్ డి టి అభిమాన సంఘ నాయకులు సోమవారం నగరం లో టి టి డి కళ్యాణ మండపం నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ మోహన్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగావారుమాట్లాడుతూ కేంద్ర హో మంత్రి అమిత్ షా ను, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యా రంగానికి ఆర్డీటీ సహాయం అందించడం లో ఆర్డీటీ పాత్ర ఎంతో కీలకమని, మా పాఠశాల లో కూడా స్వయరక్షణ లోబగంగా కరాటే, యోగా, మొదటి అంశాలు ఉ చితంగా శిక్షన ఇచ్చారు. కరోనా సమయంలో మాస్కులు శానిటైజర్లు మరియు ఇతర మోళిక సౌకర్యాలు కల్పించిన ఆర్ డి టి సంస్థను ఇంత నిర్లక్ష్యంగా చూడడం తగదు అన్నారు. ఈకార్యక్రమంలో రాప్తాడు ఆర్డీటీ అభిమానుల సంఘంనాయకులు రాచానపల్లి సుబ్రహ్మణ్యం, చిన్నకుంట జేసీ నారాయణ, ఎన్ ఎన్ కుంట తిరుపాల్, రామాంజినేయులు, మన్నీల గోపాల్,పెద్దక్క, వెంకట్రాముడు, తేజ,వెంకటరాముడు. నల్లప్ప, భీమన్న, శ్రీరాములు, తనుజ, జ్యోతి, డేవిడ్, సుష్మ పాల్గొన్నారు.

# పట్టపు కులానికి కేటాయించిన బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని రద్దుచేసి, బెస్త కులానికి ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బెస్త నాయకులు.

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 18 ప్రభాతవార్త**

పట్టపు కులానికి కేటాయించిన బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని వెంటనే రద్దుచేసి బెస్తలకే కేటాయించాలని రాప్తాడు నియోజకవర్గం బెస్త నాయకులు డిమాండ్ చేశారు. పట్టపు కులానికి కేటాయించిన బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని రద్దు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కు, తహసీల్దార్ కార్యాలయాలో బెస్త నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబెస్త కార్పొరేషన్ చైర్మన్ మరియు డైరెక్టర్ల పదవులను బెస్త కులానికి కేటాయించడం సాంప్రదాయ ని,అలా కేటాయించ లేదంటే ఆ కులాన్ని సామాజికంగా, రాజకీయంగా అణగ దొక్కడంగా భావించాల్సి వస్తుంది. బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని పట్టపు కులానికి కేటాయించడం ద్వారా కూటమి ప్రభుత్వం దుస్సాం ప్రదాయానికి తెర లేపినట్లు అయ్యింది. అంటే బెస్త కులం కేవలం ఓటు బ్యాంకు బెస్త కులాన్ని రుజువు మాత్రమేననిసామాజికంగా, రాజకీయంగా సమాధిచేయడమే. చేసినట్లుఅయ్యిందని,ఇదికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ కోఆపరేటివ్ ఫెడరేషన్ (ఆప్ కాఫ్ ) చైర్మన్ పదవిని చట్టవిరు ద్ధంగా కొల్లు పెద్దిరాజు కి కేటాయించింది. తీరా ఆ పదవి సెలక్షన్ కాదు ఎలక్షన్ అని, చేసిన తప్పును తెలుసుకొని రద్దుచేయడం బట్టి ఈ ప్రభుత్వం గంగపుత్రులకు ఇస్తున్న, ప్రాధాన్యతను తెలియజేస్తుంది.ఆ పదవి కూడా ఆప్కాఫ్ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడాబెస్తకులానికికేటాయించలేదంటే. ఈ రాష్ట్ర ప్రభుత్వాలకు బెస్త కులం పట్ల ఎంత చిన్న చూపుఉన్నదోఅర్థంఅవుతుంది. 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బెస్త కులం, కూటమి గెలుపునకు ఎనలేని కృషి చేసింది. గత వైసిపి ప్రభుత్వం బెస్త కులానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదన్న కారణంతో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇస్తే, కనీసం గత వైసిపి ప్రభుత్వం బెస్తలకు చేసినట్లుగా చైర్మన్ పదవిని కూడా బెస్తలకు ఇవ్వలేక పోయిందని, యా వత్తు బెస్త కులం క్షోభకు గురి కావడంతో పాటు తిరుగు బాటుకు సిద్ధమవుతున్నది. కావున పట్టపు కులానికి కేటాయించిన చైర్మన్ పదవిని రద్దుచేసి, బెస్త కులానికి కేటాయించ వలసిందిగా మనవి చేసుకుంటున్నాము.అలా కాని పక్షంలో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామనితెలియజేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులు శివశంకర్ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి కే శ్రీనివాసులు బెస్త భాస్కర్ బెస్త రాజేష్ బెస్త శ్రీరాములు బెస్ట్ మురళి పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బాబు

- రుద్రంపేటలో రెండవ రోజు కొనసాగిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ.



కరపత్రాలు పంచుతున్న ఎంపీటీసీ మహబూబ్ వైఎస్ఆర్సిపి నాయకులు,

**అనంతపురం రూరల్,ఆగస్ట్ 18ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని, రుద్రంపేటఎంపీటీసీమహబూబ్ బీ, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాదిక్, వైయస్సార్ సిపి నాయకులు పేర్కొన్నారు. సోమవారం అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామపంచాయతీలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు, అనంత అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం రెండవ రోజు నిర్వహించి, గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బాబు చేస్తున్న మోసాల గురించి వారు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మహబూబ్ బీ, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్, వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ బాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ కొన్ని హామీలు తూతూ మంత్రంగా కొనసాగించడం జరుగుతుందన్నారు. జరుగుతుందని, అందుకే రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన, మోసాలు దగాతోనే వచ్చి రాష్ట్ర ప్రజలను మోసగించడం జరిగేదని, ఇప్పుడు మాత్రం రాష్ట్రంలోని మహిళలను, యువతలను మరింత మోసగించి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నారా చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇటువంటి షరతులు లేకుండా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

04ATP18_04ATP18.qxd 18-08-2025 PM 11:27 Page 1



# అంబేద్కర్ విగ్రహంలో ఉన్న గంభీరం వెనుక ఎంతో విషాదం ఉంది

## - ఆయన జీవితం.. మన జీవితానికి మార్గదర్శనం.. పరిటాల శ్రీరామ్ - గరిమేకలపల్లి గ్రామంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ - ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, పరిటాల శ్రీరామ్ - పరిటాల అనే 4అక్షరాలు లేకుండా రాప్తాడు అభివృద్ధి లేదన్న ఎంఎస్ రాజు




అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రామగిరి, ఆగస్టు 18 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహం ఎక్కడ చూసినా ఒక గంభీరం కనిపిస్తుందని కానీ ఆ గాంభీరం వెనుక ఎంతో విషాదం ఉందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం గరిమేకలపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాష్కరణ కార్యక్రమం పండుగ వాతావరంలో జరిగింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయ కుడు ఎల్.నారాయణ చౌదరి సహకారంతో గ్రామంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున బోనాలతో తరలి వచ్చి, డప్పులు వాయిస్తూ, టపాసులు పేలుస్తూ, పూల వర్షం కురిపి స్తూ సందడి చేశారు. విగ్రహాష్కరణ అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. ఎంఎస్ రాజు అనేక పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చారన్నారు. తాము చేసిన పోరాటాల్లో భాగమయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవితాన్ని చదివితే కష్టాలు ఎలా ఉంటాయి, ఉన్నత స్థాయికి ఎలా ఎదగా లన్నది తెలు స్తుందన్నారు. అనేక వివక్షలను, అవమానాలను, ఎదురు దెబ్బలను తట్టుకుని ఉన్నత చదువులు చదివి దేశంలోనే ఒక మహోన్నత వ్యక్తిగా ఎదిగారన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ఒక్క డిగ్రీ చేయాలంటే కష్టపడుతున్నామని.. కానీ ఆ రోజుల్లోనే అనేక అవరోధాలు ఎదుర్కొని 32 డిగ్రీలు చేశా రంటే అంబేద్కర్ శ్రమ ఎంతో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో కుల వివక్ష, మత గొడవలు ఉండేవని, ఇలాంటి సమయంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి, ఒక మార్గదర్శనం చేశారన్నారు. ఇప్పుడు ఇది దేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా మారిందన్నారు. ఆనాడు దళితులను చెరువులో నీరు కూడా తాకనివ్వకుండా అడ్డుకుంటున్న రోజుల్లో అంబేద్కర్ మార్పు చూపించారన్నారు. అదే స్ఫూర్తితో మా స్వగ్రా మమైన వెంకటాపురంలో పరిటాల శ్రీరాములు దళితులకు బావిలో నీరు ఇచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. దళితులు మాకు వెన్నంటే ఉండి అండగా నిలిచా రని గుర్తు చేసుకున్నారు. మా కుటుంబం ఎదుగుదల, పోరాటాల్లో దళితుల పాత్ర ఎంతో ఉందన్నారు. మరోవైపు ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. దళితులు గతంలో చేసిన త్యాగాలు, కష్టాల గురించి పరిటాల శ్రీరామ్ గుర్తు పెట్టుకున్నారంటే, దానికి తామంతా కృతజ్ఞతలు చెప్పాలన్నారు. రాప్తాడు అభివృద్ధి గురించి చెప్పాలంటే పరిటాల అనే 4 అక్షరాలు లేకుండా చెప్పలేమన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఎదుగుదల వెనుక పరిటాల కుటుంబం ఉందన్నారు. ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎల్.నారాయణ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. మన దేశంలో ఎవరి మతం వారు ఆ దేవుళ్లకు మొక్కుతారని.. కానీ దేశం మొత్తం నమస్కరించేది ఒక్క అంబేద్కర్ కి మాత్రమేనన్నారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారంటే.. ఇక్కడ చైతన్యం, ప్రశ్నించే వారు ఉన్నారని అర్థమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ అంబేద్కర్ విగ్రహం ఒక దిక్సూచిగా ఉంటుందని ఎంఎస్ రాజు అభిప్రాయపడ్డారు.

# అయాకట్టు రైతున్నల కలల సాకారం కాబోతుంది

## రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలనే కోరిక - భైరవానితిప్ప ప్రాజెక్టును పరిశీలించిన విప్ కాలవ రైతు సేవా కేంద్రం ను ప్రారంభించిన విప్ కాలవ



: ప్రాజెక్టు ను పరిశీలిస్తున్న విప్ కాలవ



రైతు సేవా కేంద్రం ప్రారంభిస్తున్న విప్ కాలవ తదితరులు



:మొక్కలను నాటుతున్న విప్ కాలవ

గుమ్మగట్ట, ఆగస్టు 18 ప్రభాతవార్త

ఆయాకట్టు రైతన్నలు కలలు సాకారం చేయాలనే తపనతో ఉన్నామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు సోమవారం భైరవానితిప్ప ప్రాజెక్టు ను పరిశీలించడానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతో పాటు జెఈ ఏఈ ఎంపిడిఓ రామకృష్ణ తహాశీల్దార్ రజాక్ వలి కన్వీనర్ గిరి మల్లప్ప క్లస్టర్ ఇంచార్జ్ కాలవ సన్నన్న ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్న కృష్ణ గోనభావి దుర్గేష్ తో కలిసి భైరవానితిప్ప ప్రాజెక్టు ను పరిశీలించి భైరవాణితిప్ప ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు డిసెంబరు తొలి వారంలో నీటిని విడుదల చేయడానికి రైతులందరినీ సమాయత్తం చేస్తామని ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. అలాగే అవకాశాన్ని బట్టి చెరువులకు కూడా నీటిని అందిస్తామని వెల్లడించారు. వర్షపు నీటితో 15 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఆగస్టు నెలలోనే 1.5టీఎంసీల నీరు చేరడం ఆనందదాయకమన్నారు. మరో అర టీఎంసీ చేరితే ప్రాజెక్టు నిండుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా రెండోసారి ఈ సంవత్సరం ఆయకట్టుకు నీటిని విడుదల చేయబోతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ విషయంపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో మాట్లాడతామన్నారు. అలాగే రైతుల సూచనలు, సలహాలు తీసుకుని డిసెంబర్ మొదటి వారంలో నీటి విడుదల అంశంపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. డిసెంబర్లోనే నీటిని విడుదల చేయడం వలన ఎక్కువ విస్తీర్ణ ంలో పంటలు సాగు చేయడానికి అవకాశం ఏర్పడుతుందనీ చెప్పారు. ఈ సంవత్సరం కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మసముద్రం మండలంలో 1500 ఎకరాల్లో చివరి ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని గుమ్మఘట్ట మండలంలో ఒకటవ నెంబర్ డిస్ట్రిబ్యూటర్ నుంచి 11వ డిస్ట్రిబ్యూటర్ వరకు ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి వచ్చే నీటిని వృధాగా నదిలోకి వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో సద్వినియోగ పరచుకునేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలియచేశారు. ఇదేవిధంగా వచ్చే ఏడాది కూడా ప్రాజె క్టుకు నీరుచేరి ఆయకట్టు సాగుకు పరిస్థితులు అనుకూలిస్తాయనే ఆశా భావం వ్యక్తపరిచారు. రాబోయే రెండేళ్లలో జీడిపల్లి నుంచి బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తరలించే పనులు పూర్తిచేసి భైరవానీతిప్ప ప్రాజెక్టును నీటిని నింపటానికి తీవ్రంగా ప్రయత్ని స్తున్నామని ఆయన తెలియజేశారు తదనంతరం రైతు సేవా కేంద్రం ప్రార ంభించిన కాల మండల పరిధిలోని బిటిపి గ్రామంలో సోమవారం ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు రైతు సేవా కేంద్రాన్ని ప్రార ంభించారు, ఈ రైతు సేవా కేంద్రం రైతు భరోసా కేంద్రం గా 2019 సంవత్సరం లో 21.80 లక్షల రూపాయలు నిధులు మంజూరు కాగా అనగా అప్పటికే 90శాతం నిర్మాణం పూర్తయింది మిగతా 10 శాతం 2024 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 2.10 లక్షల రూపాయలు నిధులు ద్వారా మొత్తం 23.90 లక్షల రూపాయలుతో 100 శాతం పూర్తయిందని పి ఆర్ జెఈ రామశేఖర్ తెలిపారు బిటిపిలో ఇళ్ళ పట్టాలు పంపిణీ బిటిపిలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేతులు మీదుగా తాళ్లకేర గ్రామస్తులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామకృష్ణ తహాశీల్దార్ ప్రాజెక్టు జెఈ ఏఈ హరిష్ రజాక్ వలి రూరల్ సిఐ వెంకట రమణ ఎస్సై ఈశ్వరయ్య టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప క్లస్టర్ ఇంచార్జ్ కాలవ సన్నన్న, ఎంపిపి భవాని గోనభావి దుర్గేష్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్న కృష్ణ తాళ్ళకేర వెంకటేష్ కెపి దొడ్డి నాగరాజు బేలోడు సంజీవ పిఆర్ జెఈ రామశేఖర్ రెవెన్యూశాఖ అధికారులు సచివాలయం సిబ్బంది అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

## అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం - సింగిల్ విండో అధ్యక్షులు. వీరాంజనేయులు, రామచంద్ర



ట్రాక్టర్లు భారీ ఎత్తున ర్యాలీగా వస్తున్న దృశ్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షులు

రొద్దం. ఆగస్టు 18 ప్రభాతవార్త.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవే రుస్తూ ఈ రోజున అన్నదాత కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని సింగిల్ విండో అధ్యక్షులు నిరుగంటి వీరాంజనేయులు కురుబ రామచంద్రాలు ప్రమాణ స్వీకార సంద ర్భంగా తెలియజేశారు పెనుగొండ మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారానికి మండల వ్యాప్తంగా దాదాపు 100 ట్రాక్టర్లతో ర్యాలీ కార్య క్రమం చేపట్టారు కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రైతుల అవసరాలు మేరకు నాణ్యమైన ఎరువులను అందుబా టులో ఉంచుతూ ఎరువులు కొరత లేకుండా చేస్తామని మాకు ఇచ్చిన ఈ గౌరవాన్ని రెట్టింపు ఉత్సాహంతో పార్టీకి పనిచేస్తూ మంత్రి సవిత అడుగుజా డల్లో నడుస్తూ కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండే పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు అనం తరం సవితమ్మకు గజమాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మండల కన్వీనర్ నర హరి మాజీ జడ్పిటిసి చిన్నపయ్య మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టైలర్ ఆంజనేయులు మార్కెట్ యార్డ్ మెంబర్ మద్దిపాట్ల తిరుపాల్ నాయుడు యువ నాయకుడు శ్రీనాథ్ చౌదరి క్లస్టర్ ఇంచార్జ్ పైగేరి సిద్దన్న మోపర్లపల్లి లింగప్ప మద్దిపట్ల రమణ మా భాష మంజునాథ్ రుద్ర ప్రసాద్ చంద్రశేఖర్ నాగరాజు అంజన్నప్ప వెంకటేశ్వర్లు క్రిస్ట కార్యకర్తలు అభిమానులు రైతులు తరలివచ్చారు

# అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎసిఎ సౌత్ జోన్ ఎస్ఆర్ ఉమెన్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లు - ఛాంపియన్‌గా నిలిచిన చిత్తూరు



సౌత్ జోన్ ఎస్ఆర్ ఉమెన్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లో గెలుపొందిన చిత్తూరు టీం సభ్యులు



రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం టీం

అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త బ్యూరో

ఆగస్టు 11 నుండి 18, 2025 వరకు అనంతపురంలో జరిగిన ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు ఛాంపియన్‌గా నిలిచింది. చిత్తూరు నాలుగు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకుంది. విజేతల ట్రోఫీని ఎడిసిఎ కార్యదర్శి వి.భీమలింగ రెడ్డి అందజేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఎసిఎ రాష్ట్ర సెలెక్టర్ బి.ధనలక్ష్మి, జోన్ సెలెక్టర్లు పి.హరీష్, పి.రాధిక, అనుష, వేదవల్లి, నాగమణి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

**ఎసిజి వద్ద చిత్తూరు వర్సెస్ కడపలో చిత్తూరు 9 వికెట్ల విజయం** : టాస్ గెలిచిన కడప టీం బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 101/4 చేయగా బ్యాట్స్‌మెన్ శిరీష 33 బంతుల్లో 50 పరుగులు 4-6, 6-1, శరణ్య 26 పరుగులు, బౌలర్లు రుక్సార్ తబసుమ్-2/7, అనంతరం బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు 17.2 ఓవర్లలో 104/1తో విజయం అందుకుంది. బ్యాటర్ కె.సుభాశ్రీ 54 బంతుల్లో 57 పరుగులు 4-7 కె.హంస 23 పరుగులు చేశారు. ఫలితం - చిత్తూరు 9 వికెట్ల తేడాతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతగా చిత్తూరు నిలవగా రన్నర్స్‌గా అనంతపురం, 3వ స్థానం కర్నూలు, 4వ స్థానం కడప, 5వ స్థానం నెల్లూరు జట్లు నిలిచాయి.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి - శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 18 ప్రభాతవార్త

ఈ నెల 19న నియోజకవర్గ పరిధిలోని నార్పల మండలం పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహి ంచనున్నట్లు, యువత ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొ న్నారు. సోమవారం ఆమె కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డితో కలిసి పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఏపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడప్ ఆధ్వర్య ంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, 10కిపైగా నేషనల్, మల్టీ నేషనల్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా ఉంటుం దని, 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, పిజి చదివిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ర్యాగింగ్ తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

## జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి వి రాజశేఖర్




సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వి. రాజశేఖర్

అనంతపురం వైద్యం ఆగస్ట్ 18 ప్రభాతవార్త

ర్యాగింగ్ తో జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జ్ వి .రాజశేఖర్ వైద్య విద్యార్థుల ఉద్దేశించి అన్నారు.యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈ నెల 12 నుంచి 18 వరకు యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ వీక్ నిర్వహించాలని ఇచ్చిన పిలుపుమేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా ఆధ్వర్యంలో 2022,2023 వ బ్యాచ్ మెడికోలకు ర్యాగింగ్ నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి వి. రాజశేఖర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్‌లు హాజరై వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ర్యాగింగ్ ఓ పెను భూతమని, ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని, బంగారం లాంటి డాక్టర్ వృత్తికి న్యాయం చేసేలా జూనియ ర్లతో స్నేహభావంగా మెలగాలని, వారికి ఎలాంటి ఒత్తిళ్లను కలిగించవద్దని పిలుపునిచ్చారు. ర్యాగింగ్ కేసుతో బుక్ అయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా మాట్లాడుతూ మా మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ జోలికి ఎవరు పాల్పడకుండా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ ను ఏర్పాటుచేసి నిత్యం హాస్టల్లో, కాలేజీలో, హాస్పిటల్లో పర్యవేక్షణ చేస్తున్నామని, ఎవరైనా ర్యాగింగ్ కి పాల్పడితే శిక్షలు తప్పవని తెలిపారు. ఎలాంటి చర్యలు చేస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయని పవర్ పాయి ంట్ ప్రజెంటేషన్ తో సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో యాంటీ రేగింగ్ అవేర్నెస్ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వైద్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెడల్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ ఆచార్య డాక్టర్ శంకర్, ఆచార్య డాక్టర్ మధుసూదన్, సీనియర్ డాక్టర్లు డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్ సరళ, డాక్టర్ దుర్గ, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ పద్మ శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబును తెలుగు జాతి క్షమించదు

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించే యత్నాలు వేగవంతమయ్యాయని, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తెలుగుజాతి క్షమించదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఆంధ్రుల హక్కుగా పోరాడి సాదించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కేంద్రం వేగంగా పావులు కదుపుతోంది. అందులో భాగంగా యాజమాన్యం ఇప్పటికే 3000 మంది కాంట్రాక్టు కార్మికులను నిర్ధాక్షిణ్యంగా తొలగించింది. 1140 మంది పర్మినెంట్ ఉద్యోగులను విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపింది. ఇప్పుడు మరో 1017 మంది పర్మినెంట్ ఉద్యోగులను పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోందన్నారు. అంతేకాకుండా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించిన టిపిపి, ఎస్ఎంఎస్-1, 2, 3, ఎంఎంఎస్ఎం, ఎస్బిఎం, డబ్ల్యూఆర్ఎం-1, 2, 6, మాదారం మైన్స్, రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్-1, 2, 8, సిఎంఎస్, ఫౌండ్రీ, ఎస్టిఎం, ఈఎన్ఎండి, బ్లాస్ట్ ఫర్నిస్-1, 2, 3 వంటి ఒకేసారి 32 విభాగాలను ప్రైవేట్ వారికి అప్పచెప్పేందుకు ఉక్కు మేనేజ్‌మెంట్ టెండర్స్ రిలీజ్ చేసింది. సెప్టెంబర్ 10వ తేదిన టెండర్లు ఖరారు చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు యాజమాన్యం సిద్ధమైం దన్నారు. దీనిని బట్టి కేంద్రలో నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం రెండు కుమ్మక్కై అంచెలంచెలుగా విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు పావులు వేగంగా కదుపుతున్నాయని గోచరిస్తున్నది. మరోవైపు రాష్ట్రానికి చెందిన ఎంపిలు కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలిసి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి ప్రస్తావించకుండా, అనకాపల్లిలో ఏర్పాటు చేస్తున్న మిట్టల్ స్టీల్‌కు క్యాపిటివ్ మైన్స్ కేటాయించాలని, అనుమతులివ్వాలని కోరడం సిగ్గుచేటు విషయం అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాదని, మిట్టల్‌కు సేవ చేసేందుకు ఎంపిలు ఉద్యుక్తులవ్వడం దుర్మార్గమన్నారు. ఎంపిలు ఇదే పద్ధతుల్లో వ్యవహరిస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకపోతే తెలుగు జాతి క్షమించదన్నారు. చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరిస్తున్నామన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కాపాడేందుకు ముందుకు రావాలని, తక్షణమే లఖిలపక్షక్ష సమావేశం ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పూనుకోవాలని డిమాండ్ చేస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు.

# తాడిపత్రిని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దుతాం

## - మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి - అట్టహాసంగా ధ్యాన నీలకంఠేశ్వరుని విగ్రహావిష్కరణ



ధ్యాన శివుని విగ్రహాన్ని ప్రారంభించిన దృశ్యం



పూజల్లో పాల్గొన్న మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు, తదితరులు

తాడిపత్రిటౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త

తాడిపత్రిని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణ శివారులోని అనంతపురం రోడ్డు రైల్వే పై ఓవర్ బ్రిడ్జి సమీపంలో జె.సి ఫ్యామిలీ సొంత ఖర్చు దాదాపు 40 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన 25 అడుగుల ధ్యాన శ్రీనీలకంఠేశ్వరుని విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భ ంగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్యాన శివుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ పూజల్లో జె.సి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి పట్టణం సుందరీ కరణలో భాగంగా ధ్యాన శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే తాడిపత్రిని టెం పుల్ సిటీగా తీర్చిదిద్దు తామని ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. విగ్రహావి ష్కరణ పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చారు. హాజరైన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియల్ నాయకులు ఎస్వి రవీంద్రారెడ్డి, సూర్యముని, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి, శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమోహన్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్, శ్రీ3బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మెంబర్ చవ్వా రంగనాథ్‌రెడ్డి, టిడిపి కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి, ఒబిసి మోర్చా జిల్లా సెల్ కన్వీనర్ చెన్నా రంగనాయకులు, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, జిల్లా చేనేత ప్రోగ్రాం సెల్ కన్వీనర్ పి.నారాయణస్వామి, బిజెపి పట్టణ అధ్యక్షుడు యు.కృష్ణమోహన్‌రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జూటూరు ఓబిరెడ్డి, భీమలింగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అర్చకులు గిరిశర్మ, నందుస్వామి, మారుతిప్రసాద్‌శర్మ, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్.హెచ్ 544డి పనులను వేగవంతంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 18 ప్రభాతవార్త

జిల్లాలో ఎన్.హెచ్ 544డి పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్.హెచ్ 544డి పనులు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.హెచ్ 544 డి పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించారని, అందుకనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అనంతపురం రూరల్ లోని సోములదొడ్డి నుంచి ముచ్చుకోట గ్రామం వరకు 37 కిలోమీటర్లు, ముచ్చుకోట గ్రామం నుంచి బుగ్గ గ్రామం వరకు 32 కిలోమీటర్లు ఎన్.హెచ్ 544డి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. సోములదొడ్డి నుంచి ముచ్చుకోట వరకు, ముచ్చుకోట నుంచి బుగ్గ వరకు పెండింగ్ ఉన్న భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూసేకరణ లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఇందులో అలసత్వం ఉండరాదని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, ఎన్.హెచ్ పిడి తరుణ్ కుమార్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరిం టెండెంట్ రియాజు ద్దీన్, డిటి శ్రీనివాస్, ఏపిఐఐసి మేనేజర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాల తహసిల్దా ర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

## జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 18 ప్రభాతవార్త

వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# రైతుల అవసరానికి తగ్గట్టు యూరియా సరఫరా చేయండి

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే కాలవ విన్నపం



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయదుర్గం ఆగస్టు 15 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గంలో యూరియా కొరత అధికంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చే నాయుడుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వారి సిబ్బందితో కాలవ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో యూరియా సరఫరా, డిమాండ్ పై ఆరాతీశారు.

అనంతపురం జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేసే ప్రాంతం రాయదుర్గం నియోజకవర్గమేనని ఫోన్లో మంత్రికి వివరించారు. ప్రస్తుతం తుంగభద్ర ఎగువ కాలువ కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో యూరియాకు అధిక కొరత ఏర్పడిందన్నారు. రైతులు ఏడాదికి అవసరమైన యూరియా ఒకేసారి కొనుగోలు చేయడం వల్ల ఇతర రైతులకు సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యూరియా అదనంగా సరఫరా చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.